క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టుకు నోటిఫికేషన్

కాజులూరు: మండలంలో ఖాళీగా ఉన్న పెనుమళ్ల ఎస్సీపేట అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుకు నోటిఫికేషన్ విడుదలైనట్టు తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీఓ వి.మాధవి ఓ ప్రకటనలో తెలిపారు. పెనుమళ్ల ఎస్సీపేట అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టు ఎస్టీ విభాగానికి ప్రభుత్వం కేటాయించిందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 1-7-2023 నాటికి 21 నుంచి 35 మధ్య వయస్సు కలిగిన, స్థానిక వివాహిత మహిళ ఈ పోస్టుకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తాళ్లరేవు ఐసీడీఎస్ కార్యాలయ పని వేళల్లో.. పూర్తి చేసిన దరఖాస్తులను, అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఫిబ్రవరి 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా అందజేయాలన్నారు. జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ అధికారి సంతకం ఉండాలని, దరఖాస్తులను సమర్పించే సమయంలో అన్ని సర్టిఫికెట్ల ఒరిజినల్ కాపీలను పరిశీలన కోసం తీసుకురావాలన్నారు.

పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా కృపానందం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కె.గంగవరం: ద్రాక్షారామ పరిసర ప్రాంతాల పాస్టర్ల ఫెలోషిప్ నూతన అధ్యక్షుడిగా టి.కృపానందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని ఊడిమూడి గ్రామంలో ఉన్న అపోస్తలిక్ లైఫ్ చర్చి వద్ద సోమవారం పాస్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జేవీ ప్రసాద్, కార్యదర్శిగా పి.విజయరత్నం, ఉప కార్యదర్శిగా హిజ్కియా రాజు, కోశాధికారిగా జి.మోజేష్, ఉప కోశాధికారిగా వి.సందీప్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం రెండేళ్ల పాటు కొనసాగుతుందని అధ్యక్షుడు కృపానందం తెలిపారు. పాస్టర్ ఫెలోషిప్ అభ్యున్నతికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

మహిళామోర్చా మండల అధ్యక్షురాలిగా భారతి

కె.గంగవరం: బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా కె.గంగవరం గ్రామానికి చెందిన కాదా భారతి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఇచ్చిన ఉత్తర్వులను సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు ఏవీ రమణమూర్తి ఆమెకు అందించారు. ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

క్రికెట్ టోర్నీ విజేత ఓదూరు



టోర్నమెంట్ విజేత ఓదూరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దత్తుడు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మండాలమ్మపేటలో పది రోజులుగా నిర్వహిస్తున్న జై భీమ్ యూత్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతగా ఓదూరు జట్టు నిలిచింది. మండాలమ్మపేట, ఉండూరు, ఆదివారపుపేట, బియ్యంపేట, పాణింగపల్లి, ఓదూరు, కంబాల చెరువు, ద్రాక్షారామ, మాలపాడు, వెల్ల, సిద్ధార్థ యూత్, గాంధీనగర్ జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. సోమవారం ఓదూరు, మాలపాడు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠగా జరిగింది. విజేతగా నిలిచిన ఓదూరు జట్టుకు మండాలమ్మపేట పెద్ద మేడపాటి సూర్యనారాయణ(దత్తుడు) ట్రోఫీ అందజేశారు.

కమ్యూనిటీ హాల్ ఆవరణ మెరక పనుల పరిశీలన



తాపేశ్వరం ఎస్సీ కమ్యూనిటీ హాల్ మెరక పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

కపిలేశ్వరపురం (మండపేట): తాపేశ్వరంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఆవరణ మెరక పనులను ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కమ్యూనిటీ హాల్ ఆవరణను గ్రావెల్‌తో మెరచేసేందుకు ఆదేశించారు. ఎంపీపీ శ్రీనివాస్‌తో పాటు, ఎంపీటీసీ పిల్లా సత్తిబాబు, పంతం లక్ష్మీ పద్మారావు, వైఎస్సార్ సీపీ నాయకులు బూర చిన్న, దాసరి లాజర్ పరిశీలించారు.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజనతో ఆర్థిక ప్రయోజనం

కపిలేశ్వరపురం (మండపేట): కేంద్ర ప్రభుత్వం 2019 నుంచి అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజనతో రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరనున్నట్టు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి వీవీ సాయిరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. దీనిపై ఈ నెల 21 వరకూ అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు.

ఆడపడుచులకు ఆసరాగా..

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం
- మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి
- నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా వైఎస్సార్ ఆసరా పథకం
- నాలుగో విడత మాఫీ సొమ్ము ఖాతాలకు జమ
- ఆనందం వ్యక్తం చేస్తున్న డ్వాక్రా మహిళలు



ఇటీవల అర్తమూరులో రుణమాఫీ నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: ఇల్లాలను చూసి ఇంటిని చూడమన్నారు పెద్దలు. ఇల్లాలు మంచిగా ఉంటే ఆ ఇంటిల్లాపాది బాగుంటారని నానుడి. మహిళలు బాగుంటే ఇల్లు, గ్రామం తద్వారా రాష్ట్రం బాగుంటుందని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకం. అందుకే ఆయన ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేశారు. ఆడపడుచుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలను రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారు. ఇసుక ర్యాంపులు మహిళలవే అంటూ వారిని ముందు పెట్టి కోట్లాది రూపాయలను దోచుకున్నారు. తీరా ర్యాంపుల ఆదాయాన్ని పంచమని అడిగినందుకు కోరుమిల్లి ఇసుక ర్యాంపులో వందమంది పోలీసులతో లాఠీ చార్జి చేశారు. ప్రస్తుత ప్రభుత్వం మహిళలను అన్ని విధాలా ఆదుకుంటోంది. డ్వాక్రా రుణాలను సకాలంలో మంజూరు చేయడమే కాకుండా టీడీపీ హయాంలో తీసుకున్న రుణాలను సైతం విడతల వారీగా వైఎస్సార్ ఆసరా పథకం పేరుతో మాఫీ చేసింది. నాలుగో విడత మాఫీ సొమ్ము మహిళా సంఘాల ఖాతాలకు జమ చేసిన నేపథ్యంలో ఈ కథనం..

నాలుగున్నర ఏళ్లలో సాయం ఇలా...

కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల పరిధిలో గత నాలుగున్నరేళ్లలో 33,398 మందికి రూ.35,92,07,563 లబ్ధిని అందించింది. మండపేట పట్టణంలో 9190 మందికి రూ.22.43 కోట్లను, మండపేట రూరల్ మండలంలోని 12 గ్రామాల్లో 38,548 మందికి రూ.31,70,06,360ను పంపిణీచేశారు. రాయవరం మండలంలోని 12 గ్రామాల పరిధి/ లో 38,094 మందికి రూ.33,09,24,452 నాలుగున్నరేళ్లలో పంపిణీ చేశారు. ఈ నెలలో నాలుగో విడతగా రామచంద్రపురం రూరల్ మండలంలోని 1,504 సంఘాలకు రూ.12,56,72,360 ఇటీవల పంపిణీ చేశారు. రామచంద్రపురం పట్టణంలోని 627 మందికి రూ.5.71 కోట్లను నాలుగో విడత సాయాన్ని సంఘాల ఖాతాలకు జమ చేశారు.

మహిళాభ్యుదయమే లక్ష్యంగా రుణాలు

మండపేట, రామచంద్రపురం క్లస్టర్ పరిధిలోని రామచంద్రపురం, కె.గంగవరం, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు, రామచంద్రపురం, మండపేట పట్టణాల పరిధిలో 5,420 మహిళా శక్తి సంఘాలుండగా 75వేల మంది సభ్యులు రుణాలను పొందుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.212 కోట్లు విలువైన రుణాలు ఇచ్చే లక్ష్యంతో కృషి చేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గతేడాది డిసెంబర్ వరకూ 3,522 మహిళా సంఘాలకు రూ.254 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందజేశారు. ఈ ఆర్థిక సంవత్సరం 6,220 స్వయం సహాయక సంఘాల మహిళలకు స్త్రీ నిధి రుణాలుగా రూ.31 కోట్లు మంజూరు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఇప్పటి వరకూ స్త్రీ నిధి రుణాలుగా 5,423 మందికి రూ.30.98 కోట్లు రుణాలుగా అందజేశారు. మిగిలిన రుణ లక్ష్యాలను మార్చి నాటికి పూర్తిచేసే దిశగా ముందుకు సాగుతున్నారు.

మాఫీ సొమ్ము ఆసరాగా నిలిచింది



మాది మండపేట మండలం అర్తమూరు గ్రామం. గణపతి నగరానికి చెందిన నేను లక్ష్మీదేవీ మహిళా సంఘంలో సభ్యురాలుగా ఉన్నాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మా సంఘానికి నాలుగు విడతల్లో రూ.6,60,000 రుణం మాఫీ అయ్యింది. నాకు వ్యక్తిగతంగా రూ.నాలుగు విడతల్లో రూ.66వేలు మాఫీ అయ్యింది.

– అండిమేను లక్ష్మి, అర్తమూరు

సీఎం జగన్ రుణ మాఫీ హామీని నిలబెట్టుకున్నారు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా రుణాలను విడతల వారీగా మాఫీ చేస్తానంటూ ఇచ్చిన హామీని పూర్తిగా నిలబెట్టుకున్నారు. నేను శ్రీదేవీ మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉన్నారు. మా సంఘానికి నాలుగో విడతగా రూ.1,45,000 మాఫీ అయ్యింది. మొత్తం నాలుగు విడతల్లో రూ.5,80,000 ఆసరా పథకం ద్వారా మాఫీ అయ్యింది. వ్యక్తిగతంగా నా ఖాతాకు నాలుగు విడతల్లో 58వేలు జమ అయ్యింది.

– కర్రి సుబ్బలక్ష్మి, అర్తమూరు

వైఎస్సార్ సీపీలో లేని వారు.. టీడీపీలో చేరారా?

రాయవరం: వైఎస్సార్ సీపీలో లేనివారిని టీడీపీలో చేరినట్టుగా ప్రకటించుకోవడం హాస్యాస్పదమని సోమేశ్వరం గ్రామ సర్పంచ్ ఆరిఫ్ అన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మాజీ సర్పంచ్ వైఆర్‌కే పరమహంస ఆధ్వర్యంలో టీడీపీలో చేరినట్లుగా ప్రకటించుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు చెబుతున్న వారు ఇప్పటికీ పార్టీలోనే లేరని, అటువంటప్పుడు వారు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఎలా అవుతారని ఆయన ప్రశ్నించారు. కేవలం పార్టీ ఉనికిని చాటుకోవడానికి చేసే ప్రయత్నంలో భాగంగానే ఇటువంటి ప్రకటనలు ఇస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం అవ్వడాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. అలాగే గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇటువంటి ప్రకటనలు ఇప్పించుకుంటున్నారన్నారు.

దుగ్గుదుర్రులో 'పల్లెకు పోదాం'

కాజులూరు: మండలంలోని దుగ్గుదుర్రులో బీజేపి నాయకులు, కార్యకర్తలు సోమవారం 'పల్లెకు పోదాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు కేంద్ర సంక్షేమ పథకాలు అందాయన్నారు.

పారదర్శకతే సంక్షేమ పథకాలకు ప్రామాణికం



పట్టణంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న సూర్యప్రకాశ్

- మళ్లీ రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే..
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో పార్టీ కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: వర్గాలు, పార్టీలకతీతంగా, అర్హులైన ప్రతిఒక్కరికీ పారదర్శకతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అందించారని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని నాలుగో వార్డు కోటపేట నుంచి 10, 11 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. కాలనీల్లోని సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ పేదల కష్టాలను గుర్తించి ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అవినీతికి తావు లేకుండా, పథకాల లబ్ధిని నేరుగా ఇంటి వద్దకే చేరుస్తున్నారన్నారు. అందుకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రతి కుటుంబంలో సంతోషం నెలకొందన్నారు. ముఖ్యమంత్రి జగనన్నకు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. మళ్లీ రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు కూటమిగా ఏర్పడి సంక్షేమ పథకాలను నిలిపివేయాలనే ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని ఓర్వలేని ప్రతిపక్ష పార్టీల ప్రయత్నాలు వృథాయేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు తోట అమ్మాజీ, పాలపర్తి శ్వేతపావని మధు, కేతా సుజాత శ్రీనివాస్, పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, వార్డు నాయకులు సత్తి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా సాగునీటి ఎద్దడి పరిష్కారం

గ్రామాల్లో ఎంపీ బోస్ పర్యటన



కాజులూరులో పొలాలను పరిశీలిస్తున్న ఎంపీ బోస్, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్ తదితరులు

కాజులూరు: నీటి ఎద్దడి నేపథ్యంలో డెల్టాలోని కాలువ శివారు భూములకు సాగు నీరందించటమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. మండలంలోని తిప్పరాజుపాలెం, అయితపూడి శివారు రాయుడుమెరక, కొంకుడు మెరక తదితర గ్రామాల్లో రైతులు తమ వరి పొలాలకు సాగునీరందక ఆందోళన చెందుతున్నారు. బాధిత రైతుల ఫిర్యాదుల మేరకు సోమవారం ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాస్, ఇతర అధికారులతో కలసి ఎంపీ బోస్ పంట పొలాల్లో పర్యటించారు. అనంతరం మండల కేంద్రమైన కాజులూరులో రైతులకు, అధికారులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. గత పాలకులు వ్యవసాయం దండగ అని ప్రకటించి, రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంటలకు గిట్టుబాటు ధర కల్పించటం, వర్షాలు, వరదలు సంభవించినప్పుడు పంట నష్టపరిహారాలు ఇవ్వటం, రైతు భరోసా పథకం ద్వారా ఏటా రూ.12,500 చొప్పున ఆర్థిక సహకారం అందించటం, ఆర్‌బీకేల ద్వారా అధికారులను, ప్రభుత్వ పథకాలను రైతులకు చేరువ చేసి, దండగ అన్న వ్యవసాయాన్ని పండగలా చేశారని వివరించారు.

ఒక్క ఎకరం ఎండిపోనివ్వం

నీటి ఎద్దడి నేపథ్యంలో అధికారులను ఎప్పటికప్పుడు సమాయత్తం చేస్తూ, ఏ ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా సాగునీటి సరఫరాలో అంతరాయాలను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీ బోస్ తెలిపారు. అనంతరం ఇరిగేషన్ ఎస్ఈ జి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సాగునీటి ఎద్దడిపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోందన్నారు. గోదావరి నుంచి నీటి విడుదల సామర్థ్యం పెంచి, పంట కాలువలకు నీరందిస్తున్నామన్నారు. అవసరమైతే డ్రెయిన్లలో వృథాగా పోతున్న నీటికి క్రాస్‌బండ్ల ద్వారా అడ్డుకట్ట వేసి, ఆ నీటిని కాలువ శివారు భూముల రైతులు ఉపయోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. నీటి ఎద్దడిపై ఎప్పటికప్పుడు డివిజన్ స్థాయి అధికారులతో సమీక్షిస్తున్నామని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. దాళ్వా పంట గట్టెక్కే వరకూ అధికారులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అర్తమూరులో వేంకటేశ్వరస్వామికి నూతన వస్త్రాలను సమర్పిస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలంలోని అర్తమూరులో శ్రీదేవీ సమేత వేంకటేశ్వరస్వామి వారి 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వరస్వామి బియ్యం కట్టి వేడుకలను ప్రారంభించారు. గ్రామ దేవతలు, దేవతా మూర్తులకు బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలు అందజేశారు. బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ప్రముఖులు ఆవిష్కరించారు. కర్రి సుబ్బారెడ్డి, సుజాత దంపతులు, కుమారుడు సీఏ బుల్లిస్వామిరెడ్డి, కుమార్తె సంతోషిలు భక్తిశ్రద్ధలతో స్వామివారికి నూతన వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో శ్రీవారి భక్తమండలి కన్వీనర్ కర్రి బాపిరెడ్డి, చైర్మన్ సత్తి బుల్లిస్వామిరెడ్డి, ఆలయ సంధానకర్తలు ఉద్దగిరి ఆంజనేయులు, వెలగల శివారెడ్డి, ఉత్సవాల పర్యవేక్షకులు తాడి రామారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీల సంస్కృతి విడనాడాలి

ఎంపీపీ ఉండమట్ల



మండపేట మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలంలోని 12 గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని వక్రీకరిస్తూ ఫ్లెక్సీల రూపంలో దుష్ప్రచారం చేసే సంస్కృతిని టీడీపీ నాయకులు విడనాడాలని ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ అన్నారు. మండపేట ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి సమావేశం అజెండాను వివరించారు. సభ్యులు, సర్పంచ్‌లు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చదివి వినిపించారు. పలు సమస్యలను ప్రస్తావించారు. తహసీల్దార్ సురేష్‌బాబు, ఈవో అండ్ పీఆర్డీ ఐదం రాజు పలు అంశాలపై స్పష్టతనిచ్చారు. ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆమోదించిన పలు పనులను వైఎస్సార్ సీపీ రద్దు చేసిందంటూ గ్రామాల్లో టీడీపీ నాయకులు ఫ్లెక్సీలు ప్రదర్శించడాన్ని సహించేది లేదన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో ప్రతి గ్రామంలో పర్యటించారని, ప్రజలు ప్రస్తావించిన సమస్యలను వెంటనే స్పందించి గ్రామాలకు నిధులు మంజూరు చేసి పరిష్కరించారని గుర్తించారు. ఇంత వేగంగా సమస్యలను పరిష్కరించిన ఘనత ఎమ్మెల్సీ తోటకే సాధ్యపడిందన్న విషయాన్ని టీడీపీ నేతలు గుర్తించాలన్నారు. ఆర్అండ్‌బీ డీఏఈ పి.ఫణిలింగేశ్వరరావు మాట్లాడుతూ మండపేట–దుళ్ల రోడ్డుకు రూ. 40 లక్షలు మంజూరయ్యాయన్నారు. తాపేశ్వరం ద్వారపూడి రోడ్డులో నిగిలిన భాగాలను 20 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. వ్యవసాయం, డ్రైనేజీ, పంచాయతీరాజ్ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను సభ్యులు ప్రస్తావించగా ఆయా శాఖల అధికారులు స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మన్లు, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు.

నియమాలు పాటిద్దాం.. సురక్షితంగా ప్రయాణిద్దాం

- రహదారి భద్రత నియమాలు పాటించని వాహనదారులు
- ఈ నెల 19 వరకూ రహదారి భద్రతా మాసోత్సవాలు



రహదారి నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారి

రాయవరం: రోజురోజుకూ రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. పెరుగుతున్న వాహనాలు, అతివేగం, నిద్రలేమితో డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం తదితర కారణాలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని నియంత్రించాలంటే ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి. వాహనాల వేగానికి కళ్లెంవేయాలి. నిదానమే నినాదం కావాలి. దీనిపై అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పెరుగుతున్న ప్రమాదాలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. పలు ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయి. వాహనాలు నడపడంలో నిర్లక్ష్యం, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్, నిద్రలేమితో వాహనాలు నడపడం ఇలా పలు కారణాలతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. వీటిని అరికట్టేందుకు 35 ఏళ్లుగా రవాణా శాఖ ఏటా వాహన చోదకులకు రహదారుల్లో సురక్షిత డ్రైవింగ్, ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఏటా రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహించగా, ఈ ఏడాది రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు.

ప్రమాదాల పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2022లో 516 రహదారి ప్రమాదాలు జరగ్గా 152 మంది మృత్యువాత పడ్డారు. 497 మంది గాయపడ్డారు. గతేడాది 651 ప్రమాదాలు చోటు చేసుకోగా 222 మంది మృత్యువాత పడగా, 671 మంది క్షతగాత్రులయ్యారు. 2022తో పోలిస్తే మరణాలలో 26శాతం పెరుగుదల కన్పిస్తోంది.

లైసెన్స్ లేని వారే అధికం

వాహన చోదకుల్లో అధిక సంఖ్యాకులు లైసెన్స్ లేని వారే ఉన్నట్టు అధికారులు తనిఖీల్లో గుర్తిస్తున్నారు. లైసెన్స్ లేని వారికి భద్రతా ప్రమాణాలపై అవగాహన లేక పోవడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. పలువురు వాహన చోదకులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక సంఖ్యలో యువకులు రేష్ డ్రైవింగ్ తదితర కారణాలతో ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎప్పటికప్పుడు లైసెన్స్‌లపై అవగాహన కల్పించడం, మేళాలు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. పోలీసులు నిత్యం నాకాబందీ నిర్వహిస్తూ లైసెన్స్ లేని వారిపైనా, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ వాహనాలు నడుపుతున్న వారిపైనా కేసులు నమోదు చేస్తున్నారు. అయినప్పటికీ వాహన చోదకుల్లో పెద్దగా మార్పు కన్పించక పోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఈ నిబంధనలు తప్పనిసరి పాటించాలని

- వాహన చోదకులు రహదారుల్లో ఏర్పాటు చేసిన వేగ నియంత్రణ, సూచిక బోర్డుల ఆధారంగా వాహనాలను నడపాలి.
- డ్రైవింగ్ లైసెన్స్ ప్రతి ఒక్కరు కలిగి ఉండాలి. మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదు.
- సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదు.
- మద్యం సేవించి వాహనాలు నడపరాదు.
- ద్విచక్ర వాహన చోదకులు, వాహనంపై వెనుకన కూర్చున వారు కూడా హెల్మెట్ విధిగా ధరించాలి. 'కార్లు నడిపే వారు, కూర్చున్న వారు కూడా విధిగా సీట్ బెల్ట్ వినియోగించాలి.
- ద్విచక్ర వాహనాల్లో ట్రిబుల్ డ్రైవింగ్ ప్రమాదకరం. నేర. వాహనాలకు ఆర్సీ, ఎఫ్‌సీ, బీమా, పొల్యూషన్ సర్టిఫికేట్లు కలిగి ఉండాలి.
- రహదారులపై ద్విచక్ర వాహన చోదకులు రైడింగ్ వంటి ఫీట్లు చేసేవారు శిక్షార్హులవుతారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఏటా జనవరి మాసంలో రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది ప్రభుత్వం రహదారి భద్రతపై మరింత అవగాహన కల్పించేందుకు రహదారి మాసోత్సవాలను నిర్వహిస్తోంది. పాఠశాలలు, కళాశాలల్లో రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. రహదారి నియమాలపై అవగాహనకు పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నాం.

– ఆర్.రాజేంద్రప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, రామచంద్రపురం

నియమాలు పాటించాలి



ప్రతి వాహనదారుడు ప్రభుత్వం సూచించిన రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపైన అవగాహన లేక పోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలను నివారించాలంటే రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి.

– డి.అశోక్‌ప్రతాప్‌రావు, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, అమలాపురం

ఇంట్లోనే రిజిస్ట్రేషన్!



రామచంద్రపురం పట్టణంలోని శేషగిరి ఇంటి వద్ద రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

రామచంద్రపురం: సేవే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలిస్తోంది. నడవ లేని స్థితిలో ఉన్న వారికి మేమున్నామంటూ సచివాలయ ఉద్యోగులు ముందుకు వస్తూ సేవలందిస్తున్నారు. పట్టణానికి చెందిన రాయుడు రాము 25వ వార్డు మార్కెట్ ఏరియాలో అద్దె ఇంట్లో చాలా కాలంగా నివసించారు. ప్రస్తుతం వీఎస్ఎం కళాశాల సమీపంలోని కాలనీలో అద్దెకుంటున్నారు. వీరికి నవరత్నాల పథకాలైన పేదలందరికీ ఇళ్ల పథకంలో ద్రాక్షారామ లేఔట్‌లో ఫ్లాట్ నంబర్ 532 ఇచ్చారు. ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లలో భాగంగా రాము భార్య శేషగిరి పేరున ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. సాధారణంగా పురపాలక సంఘం పరిధిలో 12వ సచివాలయంలో శేషగిరి పేరున రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. అతడు పెరాల్సిస్ పేషెంట్ కావటంతో నడవలేని పరిస్థితిలో ఉన్నాడు. దీంతో 12వ సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారు ఇంటి వద్దే సోమవారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. వార్డు పరిపాలన కార్యదర్శి పి.విక్రమ్, వీఆర్‌ఓ ఎస్.నర్మదాదేవి, వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శి హెచ్ఎం సమీర, వలంటీర్ జి.ప్రసాద్.. శేషగిరి ఇంటికి వెళ్లి వేలిముద్రలు సేకరించి, రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. దీంతో సచివాలయాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు కొనియాడుతున్నారు.